క్లుప్తంగా

ఎగ్జిబిషన్ సేల్ పొడిగింపు



ఎగ్జిబిషన్ సేల్‌లో వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన డిజైనర్స్ ఎగ్జిబిషన్ సేల్‌ను మరో రెండురోజులపాటు పొడిగించారు. సాధారణంగా ఈనెల ఎగ్జిబిషన్ సేల్ ఈనెల 25వ తేదీతో ముగియనుండగా, ప్రజల విజ్ఞప్తి మేరకు మరో రెండు రోజుల పాటు పొడిగించామని నిర్వాహకులు తెలిపారు. మహిళా మణులు ఈ ఎగ్జిబిషన్ సేల్‌ను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రాష్ట్రజాతాను జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిర్వహిస్తున్న రాష్ట్రజాతాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మనోహర్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల రాష్ట్రజాతను జయప్రదం చేయాలని కోరుతూ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31న హిందూపురం నుంచి ప్రారంభమయ్యే రాష్ట్రజాతా జూన్ 4న కడపకు చేరుకుంటుందన్నారు. అనంతరం పాతబస్టాండులో బహిరంగ సభ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, పీవీ సుబ్బయ్య, విజయ్ భాస్కర్, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి



డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలని జిల్లా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ విషయమై గురువారం డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివానకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీని చెల్లించాలన్నారు. ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు బాలచంద్రయ్య పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు వేమయ్య

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కాషాయీకరణ నుంచి విద్యా రంగాన్ని కాపాడుకుందామని ఏఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు వేమయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోనిశ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో మూడు రోజుల పాటు జరిగే ఏఐఎస్‌ఎఫ్ విద్యా వైజ్ఞానిక రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. శాస్త్రీయ దృక్పథం కలిగిన అనేక అంశాలను పాఠ్యాంశాల నుంచి తొలగిస్తూ చరిత్రలో అసాంఘిక కార్యకర్తలుగా ముద్ర వేసుకున్న గాడ్సే లాంటి పాఠ్యాంశాలను రూపొందించడం ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివారెడ్డి, వలరాజు పాల్గొన్నారు.

రాజ్యాంగ పదవిని అవమానించడం బాధాకరం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి భారత రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం రాజ్యాంగ పదవిని అవమానించడమేనని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేష్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ అంటే రాష్ట్రపతి, రాజ్యసభ, లోక్‌సభ సమూహం అని రాజ్యాంగంలోని 79 ఆర్టికల్ చెబుతోందన్నారు. రాష్ట్రపతి లేకుండా పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించాలని నిర్ణయించడం రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లఘించడమేనన్నారు.

26, 27న తిరునాల

బ్రహ్మంగారిమఠం: మండలంలోని పలుగురాళ్లపల్లెలో వెలసిన వేళాంగిణి మాత తిరునాల ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఫాదర్ దేవరాజు ఆధ్వర్యంలో దివ్య బలిపూజ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. 27న తెల్లవారుజామున 3 గంటలకు వేళాంగిణి మాతను పురవీధుల్లో ఊరేగిస్తారని తెలిపారు.

వేసవి శిక్షణ.. భవితకు నిచ్చెన

- విజయవంతంగా సాగుతున్న 'చదవడం మాకిష్టం'
- ఉత్సాహంగా పాల్గొంటున్న చిన్నారులు



కాగితపు పూల తయారీలో చిన్నారులు



జీవితం గురించి వైకుంఠపాళి ఆట ద్వారా వివరిస్తున్న దృశ్యం



యోగా చేస్తున్న చిన్నారులు

కడప కల్చరల్ : ఇటీవలి కాలంలో పిల్లలపై చదువుల ఒత్తిడి పెరిగింది. తల్లిదండ్రులు వేసవి సెలవుల్లో కూడా రకరకాల పేర్లతో పిల్లలకు కొసరు చదువుల తరగతులకు పంపుతున్నారు. దీంతో పిల్లలు శారీరక, మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వేసవి శిక్షణ శిబిరాలకు ఇటీవల ప్రాధాన్యత పెరిగింది. పిల్లల్లో క్రమంగా అంతరించిపోతున్న పుస్తక పఠనాన్ని తిరిగి పెంచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని గ్రంథాలయాలలో నిర్వహిస్తున్నారు. కథలు చదివించడం, వాటిని సన్నివేశాలుగా మార్చి అభిప్రాయాలు, సమీక్షలు రాయించడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. తెలుగుతోపాటు ఆంగ్లం కూడా అనర్గళంగా మాట్లాడటం నేర్పుతున్నారు. ఇంకా ఆటపాటలు, బొమ్మలు గీయడం, సంప్రదాయ నృత్యాలు నేర్పడం, వృథా వస్తువులతో ఆకర్షణీయమైన వస్తువులను తయారు చేయడం తదితర అంశాలలో శిక్షణ ఇస్తున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థతోపాటు మున్సిపల్ తదితర హైస్కూళ్లలో కూడా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. కొన్ని ఆధ్యాత్మిక సంస్థలు కూడా శిబిరాలను నిర్వహిస్తుండడం విశేషం.

గ్రంథాలయాలు, పాఠశాలల్లో

కడప నగరంతోపాటు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాలలో కూడా వందలాది మంది విద్యార్థులతో ప్రత్యేక శిక్షణ శిబిరం విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం బాలల శిక్షణ శిబిరాలలో కథలు చెప్పడం, చెప్పించుకోవడం, సమీక్షల రూపంలో రాయడం, ఆంగ్లంలో మాట్లాడటం, ఆటపాలు, రంగురంగుల బొమ్మలు వేయడం, నచ్చిన ఆటలు ఆడుకోవడం, ఇష్టమైన పుస్తకాలు చదువుకోవడంతో గడిపేస్తున్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో...

పిల్లల్లో శాస్త్రీయ విజ్ఞానం పట్ల, మూఢ నమ్మకాలు, ఆచారాల పట్ల అవగాహన కల్పించడం కోసం జన విజ్ఞాన వేదిక సంస్థ ఏర్పడింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో కూడా వేసవి శిబిరాలు నిర్వహించారు. ఈ రంగంలో అనుభవం గల పలువురు రీసోర్స్ పర్సన్లు నగర పాలక సంస్థ శిబిరాలలో కూడా పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. దీంతో ఈ శిబిరాలకు విద్యార్థులు విశేష సంఖ్యలో హాజరవుతున్నారు.

ఆధ్యాత్మిక సంస్థలూ.. నగర శివార్లలోని శ్రీ లలిత పంచాయతన ఆలయంలో కూడా కొన్నేళ్లుగా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఆలయ నిర్వాహకులు, చిన్మయమిషన్ జిల్లా అధ్యక్షులు స్వామి తురియానంద ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో ఆధ్యాత్మిక విజ్ఞానంతోపాటు ఎంపిక చేసిన పుస్తకాలను చదవడం, విద్యార్థులతో వారికి నచ్చిన కథలు చెప్పించడం, వాటిలోని నీతిని చర్చించడం, నైతిక విలువలు పెంచడం, వైకుంఠపాళి ఆటతో మానవ జీవితాన్ని పోల్చి పాజిటివ్ దృక్పథాన్ని పెంచడం తదితర అంశాలలో శిక్షణ ఇస్తున్నారు.

యోగాతో ఎన్నో లాభాలు

యోగా సాధన చేయడం ద్వారా ఎన్నో లాభాలు ఉన్నాయని శిక్షకులు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కడప నగరంలోని కొండాయపల్లెలోగల సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరంలో గురువారం విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజు యోగా సాధన చేయడం ద్వారా శరీరం తేలిక పడుతుందని, పలు శారీరక రుగ్మతలు దరిచేరవని, ఎక్కువ కాలం సాధన చేస్తే ఆలోచనలను కూడా నియంత్రించుకునే శక్తి లభించగలదన్నారు. రూబిక్ క్యూబ్ నృత్యాలు, క్రాఫ్ట్ తదితర అంశాలలో కూడా శిక్షణ ఇచ్చారు.

నేడు పొలతలకు ఎమ్మెల్యే రాక

పెండ్లిమర్రి : పొలతల మల్లేశ్వరస్వామి దేవస్థానం నందు శుక్రవారం రూ.3.64 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డిలు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరై పనులు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమానికి భక్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని వారు కోరారు.

కమలాపురం : పట్టణం, 1వ వార్డు సచివాలయం పరిధిలోని కృష్ణానగర్, ఫకీర్ వీధిలో శుక్రవారం మధ్యాహ్నం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంకు ఎమ్మెల్యే హాజరు అవుతారని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

భైరవేశ్వరుడికి విశేష పూజలు

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో మండల పరిధిలోని పందిళ్లపల్లె సమీపంలో వెలసిన శ్రీ క్షేత్ర పాలక కాలభైరవేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం 13వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాగా సమీప ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరకుని స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం మహా మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు.

రామాలయాలకు భూమిపూజ

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇప్పెంట పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం రామాలయాల నిర్మాణానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులు రెడ్డిలు భూమి పూజ చేశారు. ఇప్పెంట సర్పంచ్ కొత్తపల్లి రాజశేఖర్ రెడ్డి ఆహ్వానం మేరకు వీరు హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కో–కన్వీనర్ కళాయాదవ్, మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ మల్లిఖార్జున యాదవ్, ఎంసీటీసీ వెంకటరెడ్డి, నారే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వీఎన్‌పల్లె ఎస్ఐగా లక్ష్మినారాయణ

వీరపునాయునిపల్లె : వీరపునాయునిపల్లె నూతన ఎస్ఐగా గురువారం లక్ష్మినారాయణ బాధ్యతలు చేపట్టారు. ఈయన కడప సైబర్ క్రైమ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వీరపునాయునిపల్లెకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రాజారమేష్ ప్రస్తుతం ఎస్పీ ఆఫీసుకు బదిలీ అయ్యారు.

విస్తరణ పనులు వేగవంతం చేయాలి

- అధికారులకు మున్సిపల్ కమిషనర్ ఆదేశం



దేవునికడప రోడ్డులో విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలో అంబేడ్కర్ సర్కిల్– వై జంక్షన్ రోడ్డును 80 అడుగుల మేర త్వరితగతిన విస్తరించాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. అలాగే దేవునికడప రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆక్రమణలను వెంటనే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సంజీవ్‌కుమార్, ఏసీపీ నాగేంద్ర, టీపీఎస్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పందులను శాస్త్రీయ పద్ధతిలో పెంచుకోవాలి

కడప నగరానికి దూరంగా పందులను శాస్త్రీయ పద్ధతిలో పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ ప్రవీణ్‌చంద్ సూచించారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో పందుల పెంపకం దారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పందుల వల్ల ప్రజారోగ్యానికి భంగం కలుగుతోందన్నారు. పలుమార్లు రాతపూర్వకంగా, మౌఖికంగా హెచ్చరించినా పందుల పెంపకం దారుల తీరు మారలేదన్నారు. పందులను నివాస ప్రాంతాలకు దూరంగా తరలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రతి పందికీ నగరపాలక సంస్థ లైసెన్స్ నంబర్ ఇస్తుందని, ఆ నంబర్ లేని పందులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

నగరంలో విస్తృతంగా లాడ్జీల తనిఖీ

కడప అర్బన్: ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది తమ పరిధిలోని లాడ్జీలు, హోటళ్లు, దాబాలు, ఇతర ప్రాంతాల్లో గురువారం రాత్రి తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని లాడ్జీ నిర్వాహకులకు సూచించారు. దాబాలు, హోటళ్లలో, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ రంగస్వామి తమ సిబ్బందితో కలిసి లాడ్జీలను, హోటళ్లను తనిఖీ చేశారు.

నగరవాసులకు అందుబాటులో ఆధునిక టైల్స్



కేసీ స్టోన్స్ టైల్స్ షోరూంను ప్రారంభిస్తున్న పెద్దిరెడ్డి చెన్నకృష్ణారెడ్డి, చెతన్య కుమార్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : భవన నిర్మాణాలు చేపట్టే వారి అభిరుచులకు అనుగుణంగా అత్యాధునిక టైల్స్ అందుబాటులోకి తీసుకొచ్చామని టైల్స్ షోరూం యజమానులు పెద్దిరెడ్డి చెన్నకృష్ణారెడ్డి, చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మద్రాసురోడ్డులో కేసీ స్టోన్స్ టైల్స్ షోరూంను ప్రారంభించి మాట్లాడారు. గృహ నిర్మాణ రంగంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ గృహంలో అత్యాధునిక టైల్స్ వినియోస్తున్నారని.. ఇటువంటి తరుణంలో కడప నగరవాసుల కోసం కేసీ స్టోన్స్ టైల్స్ షోరూం ఏర్పాటు చేశామన్నారు. దీనిని భవన యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి చెన్నకృష్ణారెడ్డి, చైతన్య కుమార్‌రెడ్డిల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

కడప అర్బన్: కడప నగరంలోని నబీకోటలో ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఆవరణలో చెట్టు పైనుంచి కిందపడిన ప్రమాదంలో మౌలాలీ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. అతని భార్య షాజిదా తెలిపిన వివరాల మేరకు ... కడప నగరం నబీకోటకు చెందిన మౌలాలీకి ఇద్దరు సంతానం. కూలీపని చేసుకుని జీవనం సాగించేవాడు. గురువారం ఉదయం సంఘటన స్థలంలో చెట్టును ఎక్కి కొమ్మలను నరుకుతుండగా కాలు జారి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కాగా వెంటనే కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్సపొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తాలూకా సీఐ ఉలసయ్య తెలియజేశారు.

17 మూగ జీవాలు మృతి

మైదుకూరు:మైదుకూరు మండలం కేశవాపురం గ్రామ సమీపంలోని పొలాల్లో గురువారం 17 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మిట్టమానుపల్లెకు చెందిన పేర్నపాటి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి తనకున్న 300 జీవాలను కేశవాపురం సమీపంలోని పొలాల్లో రోజూ మేపుకొంటుండేవాడు. గురువారం మందలోని సుమారు 50 గొర్రెలు ఒక్క సారిగా అస్వస్థతకు గురయ్యాయి. వాటిలో 17 మృతి చెందాయి. సమాచారం అందుకున్న మండల పశువైద్యాధికారి డాక్టర్ సుధాకర్ తన సిబ్బందితో వచ్చి అస్వస్థతకు గురైన గొర్రెలకు చికిత్స చేయగా 30 గొర్రెలు కోలుకున్నాయి. గొర్రెల మృతికి కారణాలు తెలియరాలేదు. మృతి చెందిన జీవాలకు డాక్టర్ సుధాకర్ సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్ రెడ్డి సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి నమూనాలు సేకరించి పరీక్షకు పంపారు. మిగిలిన గొర్రెలకు పశువైద్య సిబ్బంది యశోద, హుస్సేన్, చిన్న సుబ్బరాయుడు యాక్టివేటెడ్ ఛారుకోల్ ద్రావణాన్ని తాపించారు. ఈనెల 19న మండలంలోని పోతిరెడ్డిపల్లెకు చెందిన మీగడ శివారెడ్డికి చెందిన 9 జీవాలు విష ద్రావణాన్ని తాగి మృతి చెందిన విషయం తెలిసిందే.

నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ఫాతిమా మెడికల్ సమీపంలో ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గురువారం సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించారు. లారీలు, ఆటోలు, బస్సులు, ఇతర వాహనాలను నడుపుతున్నవారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను చేశారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే చట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటామనీ సీఐ హెచ్చరించారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి



'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్: విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎస్. రమణ అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫోన్ ద్వారా సమస్యలు తెలుసుకున్నారు. కడప, ఖాజీపేట, ముద్దనూరు, జమ్మలమడుగు, సీకే దిన్నె, కమలాపురం, కొండాపురం, ప్రొద్దుటూరు, పెండ్లిమర్రి మండలాల నుంచి 11 మంది ఫోన్ చేశారు. ఇందులో వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన సమస్యలు–2, విద్యుత్ లైన్లకు సంబంధించి–3, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు–1, విద్యుత్ సరఫరాలో అంతరాయం–1, ఇతర సమస్యలు–4 వచ్చాయి. వీటిని పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. డీఈఈ పి. సుబ్రమణ్యం, జేఈ లావణ్య పాల్గొన్నారు.

కడపలో పర్యటించిన రైల్వే ఎస్పీ

కడప కోటిరెడ్డిసర్కిల్: గుంతకల్లు రైల్వే ఎస్పీ చౌడేశ్వరి గురువారం కడపలో పర్యటించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రైల్వే ఎస్పీ కడప రైల్వేస్టేషన్‌లో పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఇటీవల కమలాపురం వద్ద జరిగిన దోపిడీతోపాటు ఇతర అంశాలపై చర్చించి అధికారులకు దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. అలాగే పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించినట్లు తెలిసింది.

పర్యాటక ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడపాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఆర్కే రాయల్ కరీం సేవా సమితి ప్రతినిధి కరీముల్లా, యునైటెడ్ ముస్లిం ఫోరం ప్రతినిధి రఫీక్ అన్నారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను కలిసి వినతిపత్రమిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాల విహారయాత్రలో భాగంగా గోవా, హార్సిలీహిల్స్‌లకు బస్సు సర్వీసులు వేశారని.. అలాగేజిల్లాలోని పర్యాటక ప్రాంతాలకూ బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు.

వసతి గృహంలో వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బషీర్ అహ్మద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరంలోని జిల్లా పరిషత్ కాంప్లెక్స్‌లోగల ప్రేమాలయ నిరాశ్రయల వసతి గృహంలో గురువారం వైద్య శిబిరం నిర్వ హించారు. మధుమేహం, బీపీ, రక్తశాతం తదితర పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ బషీర్ అహ్మద్, ఏఎన్ఎం లలిత, ఆశా వర్కర్లు సరోజనమ్మ, నాగమణి, వసతి గృహ నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వారధులు వలంటీర్లే

- ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు వలంటీర్లే అని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీ టీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వలంటీర్లకు వందనం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రలుగా ఎంపికైన వలంటీర్లను సన్మానించి ప్రశంస పత్రాలతో పాటు నగదును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాలను అర్హులైన ప్రజలకు అందిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా వలంటీర్లు వ్యవహరిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిదన్నారు. కార్యక్రమంలో మండల కో–కన్వీనర్ కళాయాదవ్, మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, సీకేదిన్నె సహకార సంఘం అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి, ఎంపీడీఓ రవికుమార్ రెడ్డి, తహసీల్దార్ గంగయ్య పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

వీరపునాయునిపల్లె : అర్హులైన వారందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన వీరపునాయునిపల్లె మండలంలోని యు.రాజుపాలెం సచివాలయ పరిధిలోని తాటిమాకులపల్లె, కదిరేపల్లె, యు.రాజుపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి ఏవైనా సమస్యలు ఉంటే తెలపాలన్నారు. పక్కా గృహాలు, పింఛన్లు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రజల నుంచి అందిన సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం వహించవద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నరేన్ రామాంజులరెడ్డి, వీరప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.